సాక్షి
నిజామాబాద్

సోమవారం । 15 । జనవరి । 2024



సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా..
సిద్దిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా బాలబాలికల జట్లు ప్రతిభ చూపి పతకాలు సాధించాయి.
- 8లో ▸



ద్రవరూప గంజాయి పట్టివేత
ద్రవరూపంలో ఉన్న గంజాయిని విక్రయిస్తున్న అడ్డాపై కామారెడ్డి పోలీసులు దాడులు చేశారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /19.7

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండతీవ్రత పెరుగుతుంది. సాయంత్రం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆలయాల్లోనూ డిజిటల్ చెల్లింపులు



బాల్కొండ : నోట్లరద్దు తర్వాత డిజిటల్ చెల్లింపుల హవా పెరిగింది. ఆలయాల వద్ద కానుకలు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించేవరకు వెళ్లింది. ఆదివారం మండలంలోని జలాల్‌పూర్‌లోని రంగనాథుడి ఆలయం వద్ద గోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు కానుకలు, కట్నాలను సమర్పించారు. అందుకోసం ఆలయకమిటీ సభ్యులు ఫోన్‌పే క్యూఆర్ కోడ్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఇక్కడ కూడా డిజిటల్ చెల్లింపులే అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

రైతుపై కేసు నమోదు

- ఇరిగేషన్ కాలువ స్థలంలో పంటసాగు



ఎడపల్లి (బోధన్) : మండలంలోని ఠానాకలాన్ గ్రామ శివారులో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు డీ–46 కెనాల్ స్థలాన్ని ఆక్రమించి సాగు చేసిన రైతు రాజిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కెనాల్ స్థలాన్ని ఆక్రమించి సాగుచేసిన ఉల్లి పంటను శనివారం ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులు పరిశీలించారు. ఇరిగేషన్ మండల ఏఈ రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు రైతుపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎడపల్లి ఎస్సై విక్రం పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



నిజామాబాద్ నాగారం: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 12 నుంచి 14 వరకు జనగాం జిల్లాలో జరిగిన సీనియర్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ (బాల, బాలికల) పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొన్న జిల్లా క్రీడాకారిణులు జి మమత, ఎల్ రాణి, ఎస్ సౌమ్యరాణి చక్కని ప్రతిభ చూపి రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేశారు. బాలుర విభాగంలో సెంథిల్, ప్రశాంత్, అఖిల్, వినయ్ చక్కని ప్రతిభ చూపి రాష్ట్ర జట్టును ద్వితీయ స్థానంలో నిలిచేందుకు కీలకపాత్ర పోషించినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నరేష్ వ్యవహరించారు. టోర్నమెంట్‌లో సీనియర్ మహిళల విభాగంలో ఉత్తమ పిక్చర్‌గా ఎల్ రాణి, ఉత్తమ బ్యాటర్‌గా జి మమత ప్రత్యేక బహుమతులను అందుకున్నారు.

సంక్రాంతి వేళ.. ఆనందహేల

గుజరాత్ నుంచి..



గుజరాత్ నుంచి పతంగుల ముడి సరుకు దిగుమతి చేసుకొని, ఇక్కడే తయారు చేసి, విక్రయాలు చేపడుతాం. అన్నిరకాల పతంగులు అందుబాటులో ఉంచితేనే విక్రయలు పెరుగుతున్నా యి. జిల్లాలో రూ. కోటి వరకు వ్యాపారం జరుగుతుంది.

– అశ్వక్, పతంగుల విక్రయదారుడు, నిజామాబాద్



మొదటిసారిగా ప్రారంభించాం



నేను మొదటి సారిగా ఈ సంవత్సరం పతంగులు విక్రయం ప్రారంభించాం. పతంగులకు మంచి గిరాకీ ఉంది. లక్ష పతంగులు విక్రయానికి తెచ్చాం. ప్రస్తుతం వ్యాపారం బాగానే కొనసాగుతుంది.

– వనిత, నిజామాబాద్

- ఊరూ వాడ సందడి
- భక్తిశ్రద్ధలతో భోగి మంటలు వేసిన ప్రజలు
- పతంగులతో బిజీబిజీగా యువత
- జిల్లాలో రూ. కోటి వరకు పతంగుల వ్యాపారం



బోధన్‌లోని ఆచన్‌పల్లి శివారులో భోగిమంటలు వేస్తున్న కాలనీవాసులు



నగరంలో ముగ్గు వేస్తున్న మహిళ



సంబురాల సంక్రాంతి తెలుగు లోగిళ్లకు సరికొత్త కళను తీసుకొచ్చింది. ఇంటింటా పండుగ వాతావరణం నెలకొంది. రంగవల్లులతో వాకిళ్లు మెరిసిపోతున్నాయి. నీలి మబ్బుల్లో రంగురంగుల పతంగులు ఆకట్టుకుంటున్నాయి. ప్రతిఇంటా పిండివంటల ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి. డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో ఊరూవాడ సందడిగా మారాయి. జిల్లాలో ఆదివారం భోగి సందర్భంగా తెల్లవారుజామునే భోగి మంటలు వేసి వాటి చుట్టూ తిరుగుతూ ఆనందంగా ఆడి పాడారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేయడంలో నిమగ్నం కాగా, మగువలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సోమవారం సంక్రాంతి వేడుక ను వైభవంగా నిర్వహించుకోనున్నారు. జిల్లా లో రూ. కోటి వరకు పతంగుల వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు పేర్కొన్నారు.

– నిజామాబాద్ అర్బన్

స్నేహితులతో కలిసి..



నేను ప్రతియేటా పతంగులు కొనుగోలు చేస్తాను. పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి పతంగులను ఎగురవేస్తాను. పతంగుల పండుగ అంటే ఎంతో సరదాగా ఉంటుంది.

–శ్రావణ్, నగరవాసి



భోగి సందర్భంగా నగరంలో ముగ్గు వేస్తున్న యువతి



నగరంలో పతంగులతో యువత హంగామా

వైభవంగా గోదా రంగనాయక కల్యాణం



నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో గోదా రంగనాయక కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నిజామాబాద్ సిటీ : జిల్లావ్యాప్తంగా ధనుర్మాసోత్సవం సందర్భంగాగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం గోదా రంగనాయక స్వామి కల్యాణాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ ఆలయం, ఆర్యనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం, సుభాష్‌నగర్ రామాలయం, గాజుల్‌పేట్ చక్రంగుడి ఆలయం, నాందేవ్‌వాడ గోదాదేవి ఆలయాల్లో స్వామివారికి కల్యాణం జరిపించారు. గతనెల 17 నుంచి ఈనెల 14 వరకు తిరుప్పావై ప్రవచన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

కస్టం మిల్లింగ్ కహానీ..

- ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వడంలో మిల్లర్ల అలసత్వం
- 2022–23లో జిల్లావ్యాప్తంగా 3,31,289 మెట్రిక్ టన్నులు పెండింగ్
- ఎఫ్‌సీఐ హెచ్చరించినప్పటికీ పట్టించుకోని మిల్లర్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా నుంచి ఇవ్వాల్సిన కస్టం మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు ఇప్పటివరకు ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. జిల్లాలోని మొత్తం 62 పారాబాయిల్డ్, 218 ముడిరైస్ మిల్లులు న్నాయి. ఈ మిల్లులకు పౌరసరఫరాల శాఖ ద్వారా కేటాయించిన ధాన్యానికి సంబంధించి కస్టం మిల్లింగ్ రైస్ ఇవ్వకపోవడంతో సమస్య తలెత్తుతోంది. వివరాల్లోకి వెళ్తే.. 2022–23 వానాకాలం సీజన్‌లో జిల్లాలోని మిల్లర్లకు 6,03,872 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. ఈ ధాన్యానికి గాను మిల్లర్లు 4,09,535 మెట్రిక్ టన్నుల కస్టం మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సి ఉంది. అయితే 3,87,529 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇంకా 22,005 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సిన సీఎంఆర్ పెండింగ్ ఉంది.

- 2022–23 యాసంగి సీజన్ విషయానికి వస్తే 6,35,190 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ఇచ్చారు. ఇందుకు సంబంధించి 4,32,264 మెట్రిక్ టన్నుల కస్టం మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు కేవలం 1,22,980 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి ఇచ్చారు. ఇంకా 3,09,284 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ ఇవ్వాల్సింది పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వం హయాంలో ఇష్టం మిల్లర్లు కొందరు ఇష్టం వచ్చినట్లు మొండికేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,31,289 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ఈ నెలాఖరులోగా మొత్తం సీఎంఆర్ ఇవ్వాలని గడువు పొడిగించింది. అయితే మిల్లర్లు మాత్రం ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ధాన్యం మాఫియా..

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అధికారంలో ఉన్న సమయంలో చేసిన భారీ అక్రమం ఇటీవల బయట కొచ్చింది. బోధన్‌లోని మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే నాలుగు



రైస్‌మిల్లులకు 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్‌లకు సంబంధించి పౌరసరఫరాల శాఖ ద్వారా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. ఇందుకు గాను 35 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ (కష్టం మిల్లింగ్ రైస్) కింద తిరిగి పౌరసరఫరాల శాఖకు తిరిగి ఇవ్వాల్సి ఉంది. అయితే కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. మిల్లింగ్ చేసి మిగిలిన సీఎంఆర్ బియ్యం ఇవ్వడం తనకు సాధ్యం కాదని షకీల్ చెప్పాడు. ఈ నేపథ్యంలో మిగిలిన ధాన్యాన్ని ఏఆర్ ఇండస్ట్రీస్(ఎడపల్లి), ఆర్‌కామ్ ఇండస్ట్రీస్(వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్(వర్ని), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) అనే మరో నాలుగు మిల్లులకు కేటాయించినట్లు చూపారు. ఇందుకు సంబంధించి ధాన్యం తమ మిల్లులకు బదిలీ అయినట్లు ఆ నాలుగు మిల్లులకు చెందిన యజమానులు లిఖితపూర్వకంగా రాసిచ్చారు. ఇందులో ఏఆర్ ఇండస్ట్రీస్ నుంచి 2,000 మెట్రిక్ టన్నులు, ఆర్‌కామ్ నుంచి 1,000 మెట్రిక్ టన్నులు, అబ్దుల్ ఐ నుంచి 1,000 మెట్రిక్ టన్నుల బియ్యం (సీఎంఎఆర్) మాత్రమే పౌరసరఫరాల శాఖకు ఇచ్చారు. ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ నుంచి ఒక్క గింజ కూడా ఇవ్వలేదు. మిగిలిన 26వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులు అడుగగా, షకీల్ మిల్లుల నుంచి తమకు బియ్యం రాలేదని చెబుతుండడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే షకీల్ ఒత్తిడితోనే ధాన్యం బదిలీ అయినట్లు తాము రాసిచ్చినట్లు నలుగురు మిల్లర్లు చెబుతుండడం విశేషం. ఈ విషయమై రేవంత్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

రైస్‌మిల్లుల్లో జరుగుతున్న మోసపూరిత కార్యకలాపాలు, అవినీతి అక్రమాలు బహిర్గతం చేయడానికి ఏకకాలంలో కేంద్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం ఇచ్చారు.

సీఎంఆర్ ఇవ్వకపోతే కఠిన చర్యలు



ప్రభుత్వానికి తిరిగివ్వాల్సిన కస్టం మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు తక్షణమే ఇవ్వకపోతే కఠినచర్యలు తీసుకుంటాం. కొందరు మిల్లర్ల వైఖరి కారణంగా ప్రభుత్వానికి, రైతులకు, ఇతర మిల్లర్లకు చెడ్డపేరు వస్తోంది. కొందరు మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా బయట ప్రాంతాల్లో అమ్ముకున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారుల ప్రమేయం ఉన్నట్లు తేలితే చర్యలు ఉంటాయి.

– సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

రోగుల సమస్యలు గాలికి..

- అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌లో అందుబాటులో ఉండని జీజీహెచ్ సూపరింటెండెంట్
- ప్రభుత్వం ఇచ్చిన ఫోన్ నంబర్ కాకుండా ప్రైవేట్ నంబర్ వినియోగిస్తున్న వైనం
- పీఏ చేతిలోనే ప్రభుత్వమిచ్చిన నంబర్

జిల్లా కేంద్రానికి చెందిన ఓ రోగి వైద్యవసర నిమిత్తం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేయగా పీఏ అని చెప్పుకునే వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి మేడంతో చెప్పాలనుకున్నది ఏమైనా ఉంటే నాతో చెప్పాలని పేర్కొన్నాడు. ఇలా అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉండాల్సిన ఉన్నతాధికారి తనకు సర్కారు ఇచ్చిన ఫోన్ నంబర్‌ను ఇతర వ్యక్తులకు ఇచ్చి తాను మాత్రం ప్రైవేట్ నంబర్ వాడుతున్నారు.

నిజామాబాద్ నాగారం : జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో సూపరిటెండెంట్‌కు అత్యవసర సమయంలో సంప్రదించాల్సి వస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులు పేర్కొంటున్నారు. జిల్లాలోని వివిధ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు తమకు సర్కారు ఇచ్చిన ఫోన్ నంబర్లు వినియోగిస్తుండగా సూపరింటెండెంట్ మాత్రం సర్కారు ఇచ్చిన నంబర్‌కు పక్కకు పెట్టి ప్రైవేట్ నంబర్ వాడుతున్నారు. ఈ నంబర్ దాదాపు ఎవరికీ తెలియదు. దీంతో అత్యవసర స్థితిలో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

కొన్నేళ్లుగా వాడట్లేదట..

జీజీహెచ్ సూపరింటెండెంట్ కొన్నేళ్లుగా ప్రభుత్వం సమకూర్చిన నంబర్‌ను వాడట్లేదు. ప్రైవేట్ నంబర్ కూడా చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. దీంతో ఆస్పత్రిలో సిబ్బంది సైతం ఏదైనా అత్యవసరమైతే సూపరింటెండెంట్‌ను సంప్రదించాలంటే ఇబ్బందులు వస్తున్నాయి. 86888 26835 నంబర్‌ను సూపరింటెండెంట్‌కు కేటాయించగా సదరు అధికారికి పీఏగా చెప్పుకునే వ్యక్తి వద్దే ఈ ఫోన్‌నంబర్ ఉంటోంది. జీజీహెచ్‌కు నిత్యం 1200 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఆస్పత్రిలో ఆయా విభాగాలకు హెచ్‌వోడీలు, విభాగాధిపతులు, సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. అయితే ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కొన్నేళ్లుగా సూపరింటెండెంట్ ఫోన్ నంబర్‌ను వాడడం విషయం విస్మయాన్ని కలిగిస్తోంది.



సమాచార హక్కు చట్టం బోర్డుపై జీజీహెచ్ సూపరింటెండెంట్ ఫోన్‌నంబర్

స.హ.చట్టం బోర్డుపై మాత్రం..

తెలంగాణ ప్రభుత్వ సమాచార హక్కు చట్టం బోర్డులో మాత్రం జీజీహెచ్ సూపరింటెండెంట్ 86888 26835 ఉంది. బోర్డులో మాత్రమే ఈ నంబర్ ఉంటుంది. సూపరింటెండెంట్ వద్ద మాత్రం ప్రైవేట్ నంబర్ ఉంటుంది. ఈ విషయమై జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్ నంబర్‌ను వాడుతున్న వ్యక్తి ఇచ్చిన పర్సనల్ నంబర్‌కు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు.



ద్రవ రూప గంజాయి విక్రయం

- ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ద్రవ రూపంలో గంజాయి విక్రయిస్తున్న ఓ అడ్డాపై కామారెడ్డి రూరల్ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు చేశారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరితో పాటు కొనుగోలు చేస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దేవునిపల్లి పోలీసులు జాతీయ రహదారి వెంబడి ఉన్న క్యాసంపల్లి శివారులో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయిని ద్రవ రూపంలోకి మార్చి డబ్బాలలో నింపి విక్రయించే ముఠాను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిలో ఇద్దరు గంజాయిని ద్రవ రూపంలో విక్రయించే వ్యక్తులు కాగా మరో ఐదుగురు జిల్లా కేంద్రానికి చెందిన యువకులు. ఇందులో కామారెడ్డికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల పిల్లలు ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల సత్తా


విజేతగా నిలిచిన జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: సిద్దిపేటలో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–19 పోటీల్లో జిల్లా బాల, బాలికల జట్లు ప్రతిభ చూపాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో జిల్లా బాలికల జట్టు మహబూబ్‌నగర్‌పై విజయం సాధించగా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన సిద్దిపేట్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసం, స్కూల్ గేమ్స్ అబ్జర్వర్ నీరజా రెడ్డి, నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నట్లు జిల్లా అండర్–19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.గంగాధర్ తెలిపారు. జిల్లా జట్లకు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్, సాప్పురి వినోద్, జ్యోత్స్న, రాజేందర్, గంగాధర్ వ్యవహరించారు.


ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు

అనంతరం జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో డి. సింధు (ఆర్మూర్), నేహశ్రీ, కె.మధు (సుద్దపల్లి), ఎం.ప్రణీత, ఎం,స్వప్న (ధర్మారం), సాయి ప్రహర్షిక (దోమకొండ), ఎ.తిరుపతి (ఉప్పల్‌వాయి), శ్రావణ్ (ఆర్మూర్) ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థి వర్షిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య ఆదివారం తెలిపారు. ఆర్మూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించే 67వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో వర్షిత్ పాల్గొంటాడని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థి వర్షిత్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కొయ్యగుట్ట గురుకుల ప్రిన్సిపాల్ శోభారాణి ఆదివారం తెలిపారు. ఈ నెల 20 వరకు రూ. వంద చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష ఉంటుందని మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పేకాటస్థావరంపై దాడి

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. దాడిలో రూ. 21200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటవీ జంతువును చంపిన వ్యక్తిపై కేసు నమోదు



రాజంపేట: అటవీ జంతువును చంపిన కేసులో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు అటవీ క్షేత్ర అధికారి రమేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శేర్‌శంకర్ తండాలో కాత్రోత్ గోవింద్ ఇంట్లో కొండ గొర్రె మాంసం ఉందని సమాచారం అందడంతో వెంటనే దాడి చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో కొండ గొర్రెను చంపి ఇంట్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గోవింద్‌పై జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ బాబా, భీంరెడ్డి బీట్ అధికారులు మహేశ్, దేవేందర్, సురేశ్, రాజమణి పాల్గొన్నారు.

'అపూర్వ' సమ్మేళనం


చౌట్‌పల్లి సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కవితా పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ రూరల్ : కెనడా దేశం కేంద్రంగా వెలువడుతున్న అంతర్జాతీయ పిల్లల మాసపత్రిక 'గడుగ్గాయి' నిర్వహించిన సంక్రాంతి కవితా పోటీల్లో గుండారం ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారని హెచ్‌ఎం అమర్‌నాథ్ తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి శ్రుతిరెడ్డి ప్రథమ బహుమతి, ఆర్ లాస్య, ఐశ్వర్య, కృష్ణవేణి, నిహారిక, సింధూజ, వైష్ణవి ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తున్న ఉపాధ్యాయులు కాసర్ల నరేశ్‌రావు, దస్తగిరిని హెచ్‌ఎం అభినందించారు.

బ్యాంగిల్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం



గాంధారి: మండల కేంద్రంలోని ఓ బ్యాంగిల్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. బ్యాంగిల్ స్టోర్‌లో ఆదివారం మంటలు చెలరేగడంతో దుకాణ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి మంటలను ఆర్పినట్లు తెలిపారు. విద్యుదాఘాతంతో దుకాణం కాలిపోయినట్లు పేర్కొన్నారు.

కోనేరులో పడి ఒకరి మృతి


గంగాధర్ (ఫైల్)

నందిపేట్: ఆలయంలోని కోనేరులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కుద్వాన్‌పూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామానికి చెందిన బాడోళ్ల గంగాధర్(47) శనివారం ఉదయం నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయం దర్శనం కోసం ఇంటి నుంచి బయలుదేరాడు. ఆలయ దర్శనానికి ముందు స్నానం ఆచరించడానికి కోనేరుకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ చూడకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. కోనేరులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అభిలాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: అనుమతి లేకుండా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ మండలంలో నాలుగు ట్రాక్టర్లు, సుంకినిలో రెండు ట్రాక్టర్లను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు చెప్పారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్జకుంటలో బోరు వైర్లు చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఆరు వ్యవసాయ బావుల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మోటర్‌కు సంబంధించిన వైర్లను ఆదివారం చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు రైతులకు సంబంధించిన వ్యవసాయబావుల వద్ద దుండగులు కేబుల్ వైర్లను చోరీ చేయగా వీటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చోరీకి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.